ప్రజాశక్తి
ఆదివారం 25 ఆగస్టు 2024 | 5 | అనంతపురం





గోళ్ల గ్రామంలో దెబ్బతిన్న టమోటా పంటను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

ఐఎబి ఎప్పుడో..!

◆ ఇప్పటికీ ఆయకట్టు ప్రణాళిక లేదు ◆ సందిగ్ధ స్థితిలో రైతులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటిపై సందిగ్ధ స్థితిలో అనంతపురం జిల్లా రైతాంగం ఉన్నారు. ఒకవైపు ప్రకృతి సహకారం లేకుండా ఉంది. ఏ సమయంలో వర్షమెస్తుందో.. ఎప్పుడు రాకుండా ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. జూన్‌లో మంచి వర్షాలు పడితే, జులైలో పూర్తిగా వర్షాభావం నెలకొంది. ఇప్పుడు ఆగస్టులో అధిక వర్షాలు ఈ వారం రోజుల్లో పడ్డాయి. ఇంకోవైపు మంచి వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీరొచ్చి చేరింది. తుంగభద్ర డ్యామ్, ఇటు శ్రీశైలం డ్యామ్ రెండింటి నుంచి తగినంత నీరు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో ఈసారి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీళ్లు ఎన్ని వస్తాయన్న సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి. డ్యామ్ గేటు మరమ్మతులు జరగడం కొంత ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి. జిల్లాలోని ఆయకట్టుకు ఏ రకంగా నీళ్లు ఇవ్వనున్నారన్నది తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా మిడ్‌పెన్నార్ కిందనున్న ఉత్తర, దక్షిణ కాలువల కిందనున్న ఆయకట్టు రైతల్లో ఈ గుబులు నెలకొంది. గతేడాది వర్షాభావంతో ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందలేదు. నీళ్లు అందలేదని అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సైతం నేరుగా ప్రస్తావించడం గమనార్హం. ఇప్పుడు ఈ ఏడాది ఏ ప్రాంతానికి ఏ ఆయకట్టుకు నీరు ఏ సమయంలో ఇవ్వాలని తేల్చాల్సింది ఐఎబి (సాగునీటి సలహా మండలి) సమావేశంలోనే. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ దీనిపై ఇప్పటికీ దృష్టి సారించినట్టు కనిపించడం లేదు. తుంగభద్ర డ్యామ్ గేటు పోయి నీరు వృథాగా పోయిన నేపథ్యంలో ఈసారి జిల్లాకు ఎన్ని నీళ్లు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు. అంతకు మునుపున్న అంచనా ప్రకారం జిల్లాకు 26 టిఎంసిలు తీసుకోవచ్చునని అంచనా వేశారు. నీరు వృథాగా పోయాక వచ్చేది ఎంతన్న గందరగోళం రైతుల్లో ఉంది. ఇప్పటికీ జిల్లాలోని ప్రధాన జలాశయాలైన పిఎబిఆర్, మిడ్‌పెన్నార్‌లో నీరు పూర్తి స్థాయిలో లేవు. వీటిని ఏ మేరకు నింపగలుగుతారు. అదే రకంగా ఆయకట్టుకు ఎంత నీరివ్వాలన్న అంచనాలను రూపొందించి, సద్వినియోగం ప్రణాళికలు రూపొందించాల్సింది ఐఎబి సమావేశంలోనే. ఇప్పటి వరకు ఐఎబి సమావేశం నిర్వహించలేదు. అటు హంద్రీనీ నీరు కూడా జిల్లాకు వస్తున్నాయి. ఈ నీటిని అటు అనంతపురంతోపాటు, సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రణాళిక కూడా అక్కడే జరగాల్సి ఉంటుంది. అధికారపార్టీ నేతలేమి ఇంకా సమయముందని దాటవేత ధోరణితోనున్నట్టు తెలుస్తోంది. ఎగువన్న ప్రాంతాలకు ఈ సమస్యలేకపోవచ్చుగానీ, దిగువనున్న శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాలో రైతాంగానికి నీటి విడుదలపై ఆందోళన నెలకొంది. వచ్చే నీటిని అంచనా వేసి తాగు, సాగునీటికి కేటాయింపులు జరగాల్సి ఉంటుంది. పూర్తి సమయం దాటిపోయాక సమావేశం నిర్వహించుకున్నా ప్రయోజనం ఏముంటుందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం దీనిపై మౌనంగా ఉండటం గమనార్హం.

పంటనష్టంపై ప్రభుత్వానికి నివేదికలు

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన వాటిని గుర్తించి నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ తెలిపారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని గోళ్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను శనివారం పరిశీలించారు. రైతు చంద్రశేఖర్ 5 ఎకరాల్లో సాగుచేసిన టమోటా, కర్బూజా పంటలకు జరిగిన నష్టంపై వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షపాతం వల్ల నష్టపోయిన పంటలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రాథమిక నష్టం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఎడిఎ యల్లప్ప, తహశీల్దార్ భాస్కర్, ఏవో జగదీష్ పాల్గొన్నారు.

జుంజురాంపల్లి ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీ

రాయదుర్గం రూరల్ : మండలంలోని జుంజురాంపల్లి గ్రామం వద్దఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను శనివారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి పోలీస్ అధికారులను ఆదేశించారు. 24 గంటలూ ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ఇసుక పంపిణీకి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద వాహనాలు ఎలాంటి క్యూ లేకుండా ఎప్పటికప్పుడు ఇసుక లోడ్ చేసి పంపించాలన్నారు. ఏ రోజు ఇసుక కావాలని ఆర్డర్స్ బుక్ అవుతాయో ఆరోజు లోడ్స్ డిస్పాచ్ అయ్యేలాగ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే ఇసుకను అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇసుక స్టాక్ నమోదు చేసే రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, మైన్స్ డిడి నాగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, ఒకవేళ చేస్తే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి హెచ్చరించారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం-1994పై వైద్య, ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే ప్రయివేటు, ప్రయివేటు ఆసుపత్రుల్లో గర్భవతిగా గుర్తించి నమోదు చేసుకున్న వారికి తప్పనిసరిగా నమోదు కార్డును అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఆడపిల్ల ప్రాముఖ్యత, పెళ్లీడుకొచ్చిన యువతీ యువకులు, గర్భిణులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. స్కాన్ సెంటర్లు నిర్వహిస్తున్న వైద్యులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే పిసిపిఎన్‌డిటి యాక్ట్ ప్రకారం కఠిన చర్యలతోపాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రోగ్రాం అధికారులు, డిఐఒ డాక్టర్ యుగంధర్, డాక్టర్ సుజాత, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ అనుపమ జేమ్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్, రెడ్స్ సంస్థ భానుజా, డెమో త్యాగరాజు, గంగాధర్, సుబ్రమణ్యం, వేణు, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, లీగల్ అడ్వయిజర్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలపై స్పందించండి

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ రాష్ట్రంలో 500 ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సిపిడబ్ల్యూఎస్, శ్రీరామ్ రెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం ద్వారా వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తూ కాంట్రాక్టర్లు, కార్మికులు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలొడ్డి కార్మికుల పనిచేశారని గుర్తు చేశారు. కార్మికులకు వేతనాలు నెలనెలా ఇవ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. వేతనాల రాకపోవడంతో కార్మికుల కుటుంబ జవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాల కోసం నాలుగు నెలలకు ఒకసారి కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్మెంట్ పేరుతో పథకాలకు బడ్జెట్ తగ్గింపు, కార్మికుల కుదింపు, పని గంటల పెంపు, కాంట్రాక్టర్లు 13 శాతం కమీషన్ లేకుండా చేయడం లాంటి కార్మిక వ్యతిరేక చర్యలను అమలు చేయాలని చూసిందన్నారు. ఈ నిర్ణయంతో కార్మికులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ ప్రభుత్వం స్పందించి క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్మెంట్ కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు అమలు చేయరాదని కోరారు. గ్రామీణ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నిలిపేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాదేశాలకు లొంగి రాష్ట్రంలో నివాస గహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందని, అదే విధానాన్ని తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అమలుకు సిద్ధపడడం సరికాదని విమర్శించారు. అదానీ, షిరిడి సాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులను కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందన్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించిందన్నారు. హైకోర్టులో పిటీషన్లు వేశారని గుర్తు చేశారు. నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడానికి నిర్ణయించు కోవడం ఏమిటని ప్రశ్నించారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. తదుపరి వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారన్నారు. మొదటి దశలో వ్యవసాయం పంపు సెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్‌కు ఎసరుపెట్టే ప్రమాదం ఉందన్నారు. నివాస గహాలకు మీటర్లతో ప్రీపెయిడ్ పద్ధతి, విద్యుత్ వాడే సమయాన్ని బట్టి అదనపు ఛార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వేయటం తదితర రూపాల్లో భారం పడుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందన్నారు. ప్రజలు, రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అదానీ, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల అభివృద్ధికి మొదటి నుంచే కార్యాచరణతో ఉన్నామన్నారు. ఆయా పంచాయతీల్లో సీసీ రోడ్లు ఇతర వాటికి నిధులు కావాలని గతంలోనే పంచాయతీ రాజ్ శాఖ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అందుకే ఇప్పుడు ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతపురం రూరల్ పంచాయతీకి రూ.కోటి, రుద్రంపేట పంచాయతీ రూ.70 లక్షలు, రాజీవ్ గాంధీ పంచాయతీలకు రూ.70 లక్షలు, నారాయణపురం పంచాయతీకి రూ.50 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులన్నీ సక్రమంగా వినియోగించుకునేలా చూస్తామన్నారు. ముఖ్యంగా పనులు నాణ్యతగా ఉండేలా చొరవ తీసుకుంటామన్నారు. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభమవుతాయన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు, నాయకుల సలహాలు కూడా తీసుకుంటామన్నారు. అయితే పనులు చేపట్టిన తరువాత నిర్ణీత గడువులోగానే పూర్తి కావాలన్నారు. నగరంలో కలిసిపోయి ఉన్న ఈ పంచాయతీలను నగరానికి ధీటుగా మారుస్తామని తెలిపారు.

ఈ-పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

జిల్లాలో ఈ-పంట నమోదు ప్రక్రియ వేగవంతంగా చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రైమరీ సెక్టార్ అయిన వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు పూర్తి చేసేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కౌలురైతు కార్డుల జారీ ప్రక్రియలో అలసత్వం వహించకుండా నిర్దేశిత కాలంలోనే పూర్తి చేయాలన్నారు. అలాగే జిల్లాలో టమోటా రైతులు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొన్న సమస్యలను ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన సహాయ సహకారాలు అందేవిధంగా వారికి సహకరించాలన్నారు. గిట్టుబాటు ధర వచ్చేలా జిల్లా అధికారులు పరిశీలించాలన్నారు. రైతులను ఆదుకునే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. అలాగే జిల్లాలో టమోటా రైతులకు ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసేలా, ప్రభుత్వానికి నివేదికలు తయారుచేసి పంపాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన అధికారులు, బిఎంవి.నరసింహారావు, ఎడి మార్కెటింగ్ సత్యనారాయణ చౌదరి, వ్యవసాయ, ఉద్యాన అధికారులు మండల స్థాయి అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వన మహోత్సవం

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వక్షశాస్త్ర విభాగం, జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో శనివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో గత సంవత్సరం ప్రారంభించిన వృక్షశాస్త్ర విభాగం కొత్త గార్డెన్‌ను మీరంతా కలిసి అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ గార్డెన్‌కు అవసరమైన మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం వృక్షశాస్త్ర అధ్యాపకులు విజయ్‌కుమార్ అధ్యాపకులు విద్యార్థులతో చీమచింత, కానుగ, రావి, గులాబీ మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.నారాయణ, దొడ్డ నాగప్ప, అధ్యాపకులు పరీషా, బాలానరసింహులు, బాబు, దేవదాసు, పాలరాజు, నాగమణి, వినోద్, పాండురంగ, లీలావతి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కెటిఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.2 లక్షలు, ఏటిఎం చోరీలకు ఉపయోగించే సామగ్రి స్వాధీనం - ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో ఇటీవల ఎటిఎం కేంద్రాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర హర్యానా దొంగల ముఠాను అనంతపురం సిసిఎస్, 4వ పట్టణ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు...

అరెస్టయిన వారిలో హర్యానా రాష్ట్రం అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, షాకీర్, ఘసేరా గ్రామానికి చెందిన సలీం, రోజ్ కామియో గ్రామానికి చెందిన హుక్మాఖాన్, రాజస్థాన్‌లోని ఆల్ గని గ్రామానికి చెందిన మజీద్ ఉన్నారు. పరారైన వారిలో వాసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారిష్, అతావుల్లా ఉన్నారు. వీరి నుంచి లారీ, చోరీలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5- సెల్ ఫోన్లు, రూ. 2 లక్షల నగదు, మూడు ఇనుప రాడ్లు, బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రే లను స్వాధీనం చేసుకున్నారు.



అంతర్ రాష్ట్ర నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

ఈనెల 2వతేదీ తెల్లవారుజామున 2:45 గంటలకు గార్లదిన్నె పోలీసుస్టేషన్ పరిధిలోని కల్లూరు ఎస్‌బిఐ ఎటిఎంలో అనంతపురం రామ్‌నగర్ తరహానే గ్యాస్ కట్టర్‌తో ఎటిఎం మిషన్ ను కట్ చేసి రూ.3,28,600 నగదు ఎత్తుకెళ్లారు. 7వతేదీ అర్ధరాత్రి 1 గంట సమయంలో కూడేరు మండల కేంద్రంలోని ఎటిఎం సెంటర్‌లో చొరబడి గ్యాస్ కట్టర్ ద్వారా క్యాష్ మిషన్ ను కట్టింగ్ చేసి రూ.18,41,300 తస్కరించారు. ఈనెల 4వతేదీ తెల్లవారుజామున నగరంలోని రామ్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి మొత్తం రూ.29,80,000 నగదు ఎత్తుకెళ్లారు. వీరి ఖర్చుల కోసం చెరో రూ.5వేలు తీసుకుని మిగతా మొత్తం డబ్బును పరారీలో ఉన్న రాబిన్ వద్ద ఉంచారు. షాకీర్, ఇంకొకరు కలిసి లారీలో వెళ్లగా మిగితా 10 మంది నిందితులు రాబిన్ సహా రెండు కార్లలో వెళ్లారు. ఏటిఎం కేంద్రంలోకి వెళ్లి గ్యాస్ కట్టర్ ద్వారా క్యాష్ మిషన్ ను కట్టింగ్ చేసి అందులో ఉన్న నగదు తీసికెళ్లే క్రమంలో పోలీసు సైరన్ రావడంతో పరారయ్యారు. కర్నాటక రాష్ట్రం చిక్కబళ్లాపూర్‌లో ఇదే 12 మంది కల్గిన హర్యానా అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఏటిఎం సెంటర్లో చొరబడి గ్యాస్ కట్టర్ ద్వారా క్యాష్ మిషన్‌ను కట్టింగ్ చేసి రూ. 18,24,500 నగదుతో ఉడాయించారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీసు స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో దొంగతనం చేసి రూ. 25,98,400 నగదు అపహరించుకెళ్లారు. అన్ని చోరీలూ ఒకే పద్ధతిలోనే చేశారన్నారు.

ఈ ముఠాలో రాబిన్, సలీం కీలక నిందితులు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో షాకీర్ ట్రక్ డ్రైవర్. హర్యానా నుంచి బెంగళూరుకు ఏదైనా లోడ్‌తో వెళ్లి అన్‌లోడ్ తర్వాత తిరిగి లోడుతో హర్యానాకు వెళుతుంటాడు. ఈ క్రమంలో ఏటీఎం కేంద్రాలను జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఏటీఎం కేంద్రాలను పరిశీలించి అక్కడ భద్రత, సీసీ కెమెరాలు, ప్రజల రద్దీ, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని సులువుగా చోరీ చేసేందుకు వీలున్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి వాటి సమాచారాన్ని, తిరిగి హర్యానాకు వెళ్లాక, రాబిన్, సలీంలకు అందిస్తాడు. ఆ తర్వాత గ్యాస్ కటింగ్ లలో ప్రావిన్యుడైన సద్దాం తో రాబిన్ చర్చించి మిగతా సభ్యులను కూడా సమీకరించుకుంటాడు. ఈ ముఠా సభ్యులందరూ అనంతపురం జిల్లాకు వివిధ ఫేక్ నంబర్లతో రెండు కార్లలో బయలుదేరి వస్తారు. ఈక్రమంలో అందరూ కలిసి ఆయా ప్రాంతాల్లోని ఏటిఎం సెంటర్ల వద్దకు స్థానికంగా ఉన్న ఆటోలలో ప్రయాణించి రెక్కీ నిర్వహిస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి 2 నుంచి తెల్లవారుజామున 4 గంటల్లోపు అనువైన సమయంలో ఏటీఎం కేంద్రాల్లో వీరు చోరీ చేస్తారు. ఏటిఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడ్డాక తస్కరించిన సొమ్ములో ఖర్చుల కోసం కొంత డబ్బు ముఠా సభ్యులకు ఇచ్చాక మిగితా నగదు యావత్తు రాబిన్ వద్దే ఉంచుకుంటాడు. హర్యానాకు వెళ్లాక వాటాల ప్రకారం పంచుకుంటారు.

జిల్లాలో ఇటీవల నాలుగు చోట్ల ఏటీఎం కేంద్రాలలో చోరీలు జరిగాయి. ఈ నేపథ్యంలో గత ఎస్పీ కెవి మురళీకృష్ణ, నూతన జిల్లా ఎస్పీ పి.జగదీష్ వీటిని ఛేదించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈక్రమంలో డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సిఐలు సాయినాథ్, ప్రతాప్‌రెడ్డి, ఇస్మాయిల్, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, ఎస్‌ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్లు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్లు రంజిత్, దాస్, ఆసీఫ్, ప్రసాద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబుళేసు, వెంకటరమణ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ ముఠాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పక్కా రాబడిన సమాచారంతో ఐదుగురి ముఠాను స్థానిక కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్ ప్రక్కన చెట్ల పొదల వద్ద అరెస్టు చేశారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న అనంతపురం 4వ పట్టణ ఇన్స్‌పెక్టర్ కె.సాయినాథ్, సిసిఎస్ సిఐ ఇస్మాయిల్ బృందాన్ని డిజిపి ద్వారకా తిరుమలరావు అభినందించారు.



పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

తాగునీటి సమస్య పరిష్కారం

గుత్తి : మండలంలోని పుల్లేటి యర్రగుడి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచి ఎం.పాపన్న శనివారం పరిష్కరించారు. గ్రామంలోని హెడ్ ఓవర్ ట్యాంకు నుంచి ఎస్టీ కాలనీకి వెళ్లే తాగునీటి పైపులైను ధ్వంసం కావడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

26న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" రద్దు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేసినట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అదును దాటాక పదును



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అదును దాటక పదునైంది. ఈ వారంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. జులై నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. గతేడాది లాగానే ఈసారి కరువు పరిస్థితులే నెలకొంటాయా అన్న సందేహం నెలకొంది. ఈ వారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ విస్తారంగా వర్షాలు పడ్డాయి. సాధారణం కంటే 200 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. అంతకు మునుపు జూన్ నెలలోనూ సాధారణం కంటే అధికంగా వానలు పడ్డాయి. జూన్‌లో 147 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. జులై నెలలో 60 శాతం లోటు వర్షపాతం పడింది. వర్షాధారంపై సాగయ్యే ఈ ప్రాంతంలో జులై నెల కీలకం కావడం గమనార్హం. ఎందుకంటే వేరుశనగ సాగుకు అదే అనువైన సమయం. ఆగస్టు మొదటి వారం తరువాత విత్తనం విత్తుకుంటే చివర్లో వర్షాలు తగ్గుతాయి కాబట్టి దిగబడులు కూడా సరిగా రావాని రైతులు విత్తనం విత్తుకోరు. ఈ పదునులో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అనుకూలం. కాకపోతే ప్రభుత్వం అందుకు తగ్గట్టు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం చేసి ఉంటే రైతులు ఈ తేమలో విత్తనం విత్తుకునే వారు. కాని 80 శాతం సబ్సిడీ అయితే ప్రకటించింది కాని ఇప్పటి వరకు పంపిణీని మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో రైతులు తమ సొంత ప్రయత్నాల్లో ఉంటున్నారు. ఈ వర్షాలకు చాలా చెరువుల్లోకి నీరు వచ్చి చేరడం సంతోషించదగిన విషయం.

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా పోతున్న విషయం తెలిసిందే. ఈ వారంలో దాని అరికట్టే ప్రయత్నాలు చేయడంలో ఇంజినీర్లు సఫలమయ్యారు. మరోమారు ఇన్‌ఫ్లోస్ కూడా డ్యామ్‌కు వస్తుండటం సంతోషించదగిన విషయం. ఇంకోసారి వానలొచ్చి నిండితే నష్టపోయిన నీళ్లు తిరిగి పొందినట్టవుతుంది. ఇది సంతోషించదగిన విషయం. ఇక ఈ వారంలో రాజకీయంగానూ తాడిపత్రి మరోమారు భగ్గుమంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లిన సమయంలో టిడిపి నాయకులు, వారికి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో వాహనాలు, ఇళ్లు తగలబడ్డాయి. మరోసారి ఈ అంశం వార్తలొకెక్కింది. రాప్తాడులోనూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సంబంధించిన సంస్థ ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా బిల్లులు తీసుకుందన్న అంశం ప్రధాన చర్చనీయాంశంగా ముందుకొస్తోంది. ఆ సంస్థ కేసు నమోదు చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. రాజకీయంగా ఇది చర్చనీయాంశంగా ఉంది. ఇదే క్రమంలో అంతకు మునుపున్న ఎస్పీ మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగదీశ్ నియమితులవడమే కాకుండా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే జిల్లా ముఖ్య అధికారుల బదిలీలు పూర్తయ్యాయి. ఇక ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బదిలీలకు ఉద్యోగులు తమతమ ప్రయత్నాలు ముమ్మరంచేసుకుంటున్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ మొత్తం వచ్చే వారంలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఉద్యోగులు పూర్తిగా ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. తాము కోరుకున్న స్థానాలకు బదిలీ చేయించుకుని వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా వంశీకృష్ణ భార్గవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ నరసారెడ్డిని విజయవాడకు బదిలీ చేయగా పెనుగొండలో పనిచేస్తున్న వంశీకృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-యల్లనూరు


యల్లనూరులో మాట్లాడుతున్న ఇఒఆర్‌డి విజయ్ శేఖర్‌నాయుడు

వచ్చేనెల 1వతేదీన సామాజిక పింఛన్ల పంపిణీలో జాప్యం వహించకూడదని ఇఒఆర్‌డి విజయ్‌శేఖర్ నాయుడు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా క్లస్టర్లలో 1వ తేదీన ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : వచ్చేనెల 1వతేదీన ఉదయమే సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపిటిఓ రామచంద్ర సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారుల ఆదేశాల మేరకు పింఛన్‌దారులకు 1వ తేదీన ఉదయం 6 గంటలకే వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశులు, జగదీష్, శ్రీరాములు, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వచ్చేనెల 1వతేదీన పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒ విజయభాస్కర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది 1వతేదీన ఉదయం 6 గంటలకే పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంజారాలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

ఎఐబిఎస్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రీనాయక్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలను సభల దృష్టికి తీసుకెళ్లేందుకు బంజారాలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రీనాయక్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78ఏళ్లు కావస్తున్నా బంజారాల జీవన స్థితిగతుల్లో మార్పులు రాలేదన్నారు. ముఖ్యంగా విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న బంజారాలకు రాజకీయంగా ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ పదవి కూడా కల్పించలేదన్నారు. బంజారాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలంటే తమకు కూడా చట్టసభల్లోగానీ, నామినేటెడ్ పదవుల్లోగానీ ప్రాతినిథ్యం కల్పించాలని కోరారు. ఇకపోతే తండాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కోసం రూ.కోటి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కసాపురానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

శ్రావణమాసం 3వ శనివారాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శణానికి భక్తులు పోటెత్తారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అధికారి భద్రాజి, ఎఇఒ మల్లికార్జున భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


నేమకల్లులో పూజలందుకున్న అంజన్న

బొమ్మనహాల్ : శ్రావణమాసం 3వ శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని నెమకల్లులో వెలసిన ఆంజనేయ స్వామి దర్శణానికి భక్తులు పోటెత్తారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, తమలపాకల పూజ, అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. జిల్లానుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ కౌంటర్లు ఏర్పాటు చేశారు.

రైఫిల్ పోటీల్లో 'అనంత'వాసుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం


ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఎండి శ్రీకాంత్

రైఫిల్ పోటీలో అనంతపురం వాసులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పిస్టల్‌లో ధాత్రి బంగారం, రైఫిల్‌పై ఉద్యతి బంగారం, రైఫిల్‌లో సశాంక్ రజతం, పిస్టల్‌లో జోష్న బంగారం పథకాలు సాధించినట్లు అకాడమీ ఎండి శ్రీకాంత్ తెలిపారు. 10 మీటర్ల రైఫిల్, పిస్టల్ షూటింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

29న పిస్టల్ షూటింగ్ పోటీలు

స్థానిక ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 29న ఎయిర్ రైఫిల్, పిస్టల్ షూటింగ్, ఎయిర్ రైఫిల్ (ఓపెన్, పీప్ సైట్), పిస్టల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ ఫౌండర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జంతువధకు పశువుల డాక్టర్ అనుమతి తప్పనిసరి

పామిడి : కలెక్టర్ ఆదేశాల మేరకు పామిడి గ్రామ పంచాయతీ పరిధిలో పొట్టేళ్లు, మేకలు, ఎద్దులు, ఎనుములు, పందులను వధించాలంటే తప్పనిసరిగా పశువుల డాక్టర్ అనుమతి తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ సూచించారు. శనివారం పట్టణంలో పశువులను వధించే వారు, అమ్మకందారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువధను చేసేవారు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాంటి వారు ప్రజల ఆరోగ్యాలకు భద్రత కల్పించాలన్నారు. అమ్మకం సెంటర్ల వద్ద శుభ్రత పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కృత్రిమ కాలు వితరణ

నార్పల : ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయిన పామిడి గ్రామానికి చెందిన కుళ్లాయప్పకు శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి కృత్రిమ కాలును వితరణ చేశారు. కృత్రిమ కాలు ఇవ్వాలని ట్రస్టును ఆశ్రయించగా ఆర్థికసాయం చేసి అందజేసినటుల ట్రస్టు ప్రతినిధి కొండశెట్టి ప్రవీణ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు

అనంతపురం : స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీసత్యసాయి బాలికల జూనియర్ కళాశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హోమియో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఫార్మాసిస్ట్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది శాంతమ్మ, మానవ హక్కుల సంఘం సౌతిండియా సెక్రటరీ ఆవుల ప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయురాలు మహబూబ్ చాంద్, హరిత, దేవి, త్రివేణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెద్దపప్పూరు : మండల పరిధిలోని పసలూరు హెల్త్, వెల్నెస్ సెంటర్‌ను జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి కిషోర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జాతీయ కార్యక్రమాల అమలు తీరు, రికార్డులు, వైద్యం వివరాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి, జిల్లాస్థాయి అధికారి జరీనా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భారతి, షర్మస్‌వలి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

నార్పల : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో హర్షిత ఆసుపత్రి సౌజన్యంతో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీటీ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వివిధ రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జి.రాము, రామచంద్ర, మార్కెటింగ్ మేనేజర్ డి.హరి, ఆసుపత్రి ఇన్‌ఛార్జి మధు, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు దొడ్డి నాగప్ప, ఆశావర్కర్ అంజలి, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన


అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల : బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి)లో శనివారం ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ హెచ్ఐఆర్ మేనేజర్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జితేందర్‌సింగ్ ప్రస్తుతం పరిశ్రమ పోకడలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐటి కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి, కళాశాల ఉపాధ్యక్షుడు ఎం.రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అనంతపురం : స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అనంతపురం జోన్ ఎజిఎం సుబ్బారెడ్డి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తర్వాత శ్రీకృష్ణ వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, అకడమిక్ జిల్లా కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, అకడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దీప, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మ వృత్తాంతం గురించి వివరించారు. తర్వాత పాఠశాల ఆవరణలో శ్రీకృష్ణ వేషధారణలో ఉన్న గోపీ, శ్రీకృషులతో ఉట్టి కొట్టించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఏవో గోపాల్, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ ఇన్‌ఛార్జిలు నీరజ, హారతి, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.


బెలుగుప్ప మండలంలోని శ్రినివాస విద్యానికేతన్‌లో సంబరాలు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణ, గోపీక వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే సన్‌రైజర్స్ పాఠశాలలో కూడా ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కార్తీక్‌కుమార్ రెడ్డి, డాక్టర్ రిషి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిరిపురం నాగరాజు, కరస్పాండెంట్ మారెన్న, ఉపాధ్యాయులు



ఆదిమూర్తినగర్‌లోని శ్రీచైతన్యలో చిన్నికృష్ణులు

సంధ్య, మమత, నాగవేణి, శిరీషా, మాలశ్రీ, ఎర్రిస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని భావన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులు శ్రీకృష్ణుడు గోపికల వేషంలో అలంకరించి పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని సెయింట్ పాల్ హైస్కూలులో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనేక మంది విద్యార్థులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో నృత్యాలు చేశారు. తర్వాత ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న ముళ్లపొదలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్లపొదలు

తొలగించాలని సిపిఎం డిమాండ్

రాయదుర్గం : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్ళపొదలు అల్లుకున్నాయన్నారు. దీంతో విద్యుత్ కార్మికులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని కోరారు.

రుద్రంపేటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ


వర్షంలోనే మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

అనంతపురం క్రైం : రూరల్ పరిధిలోని రుద్రంపేటలో ఎట్టకేలకూ శుక్రవారం రాత్రే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. వెంటనే స్పందించిన డి-5 ఎఇ ప్రసాద్, లైన్ ఇన్స్‌పెక్టర్ సూర్యనారాయణ సిబ్బందితో కలిసి రుద్రంపేటకు చేరుకుని వర్షాన్ని సైతం లెక్కజేయకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోండి

యల్లనూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రెవెన్యూ గ్రామ పరిధిలో దాదాపు 200 నుంచి 300 ఎకరాలు మాత్రమే ఈక్రాప్ బుకింగ్ అయిందన్నారు. మిగిలిన రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అలాగే మండలంలోని కల్లూరు, యల్లనూరు గ్రామాల్లో ఈ క్రాప్ చేసేందుకు అధికారిని నియమించినట్లు తెలిపారు.


నార్పల ఎస్ఐగా సాగర్



నార్పల : నార్పల ఎస్ఐగా సాగర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై విఆర్‌కు వెళ్లగా తాడిపత్రి రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సాగర్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహచర సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూస్తానన్నారు. అనంతరం మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలిసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

28 నుంచి ఉరవకొండ బీబీ జైనబ్బీ ఉరుసు

వజ్రకరూరు : ఉరవకొండలో వెలసిన హజరత్ బీబీ జైనబి అమ్మవారి ఉరుసు ఉత్సవాలు ఈనెల 28 నుంచి 30వతేదీ వరకూ ఉరవకొండలో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 28న గంధం, 29న ఉరుసు, 30న జిహారత్ వేడుకలతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు. ఉరుసు వేడుకల్లో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత ఖవ్వాలి పోటీదారుడు రైస్ అనీష్ శబరి ఈనెల 30న కవాలి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.


విద్యుత్ వెలుగుల్లో జైనబ్బీ దర్గా

సబ్‌జైలులో వైసిపి నేత మృతి


ఉమామహేశ్వరరెడ్డి

పెద్దవడుగూరు : మండల కేంద్రానికి చెందిన వైసిపి మండల సీనియర్ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి (57) గుండెపోటుతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఉమామహేశ్వరరెడ్డి మండలానికి చెందిన ఓ కేసులో కడప జైలులో జైలులో ఉన్నాడు. ఈనేపథ్యంలో శనివారం జైలులో గుండెపోటు రాగా రీమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఇతను మండలంలో ఒకప్పుడు తెదేపాలో సీనియర్ నాయకుడిగా ఉంటూ మండల బాధ్యతలను తీసుకునేవారు. ఈయన గతంలో ఉత్తర కాలవ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ కూడా పనిచేశాడు. గత 2019 ఎన్నికల సమయంలో వైసిపిలో చేరారు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి మండల టిడిపి, వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


మృతిచెందిన చంద్రశేఖర్

గుత్తి : పట్టణంలోని చెంబులబావి వీధికి చెందిన ఓ ఆటో డ్రైవర్ శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెంబులబావిలో నివాసం ఉండే చంద్రశేఖర్ (53) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో కొంతకాలం క్రితం ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. ఆ బాధను భరించలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా ఉద్యోగి తీవ్రంగా గాయపడింది. గుత్తి పట్టణానికి చెందిన హరిత పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తోంది. విధుల నిమిత్తం ఆమె క్రిష్టిపాడుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తొండపాడు వద్ద కుక్క ఆటో రావడంతో బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణ పొలిమేరలో మల్లాపురం లేఅవుట్ సమీపంలో ఉన్న గుట్టపై పేకాట ఆడుతున్న 22 మందిని పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. నిందితుల నుంచి 21 ద్విచక్ర వాహనాలు, 21 సెల్‌ఫోన్లు, రూ.43,210 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.